నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
I నల్లగొండ, బుధవారం 14 మే 2025 SURYAPET



టీజీఆర్ఎస్ రాష్ట్ర శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

## తండాలను రెవెన్యూ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, మే 13: రాష్ట్రంలోని తండాలను గత ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిందని, వాటిని రెవెన్యూ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో టీఆర్జీఎస్ రాష్ట్ర శిక్షణ తరగతుల కరపత్రాలను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేద దళిత, గిరిజనుల పిల్లలకు 25 శాతం సీట్లను కేటాయించి ఉచితంగా విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ ఉన్నప్పటికీ విద్యా, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఇప్పటికీ వారు వెనుకబడే ఉన్నారని, సబ్‌ప్లాన్ నిధులను వారికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. హాలియా పట్టణంలో నిర్వహించే టీజీఆర్ఎస్ రాష్ట్ర శిక్షణ తరగతులు జయప్రదం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీజీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేశ్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్‌నాయక్, నాయకులు రమావత్ రమేశ్ నాయక్, ప్రదీప్‌నాయక్, మణినాయక్, దేవేందర్ నాయక్ పాల్గొన్నారు.



నకిరేకల్‌లో కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## కార్మిక హక్కుల కోసం ముందుండి పోరాడుతాం

- దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, మే 13 : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, కార్మిక హక్కుల కోసం తమ పార్టీ ముందుండి పోరాడుతుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ నకిరేకల్ పట్టణంలోని శకుంతల ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఎన్‌హెచ్ఎం ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతంగా అమలు చేస్తున్నదని, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌ల అమలుకు చర్యలు వేగవంతం చేయడం ఎంతవరకు సమంజసమని తెలిపారు. ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నకిరేకల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, బీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిల్వేరు ప్రభాకర్, సీఐటీయూ జిల్లా నాయకుడు వంటెపాక వెంకటేశ్వర్లు, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు అంబటి చిరంజీవి, బీఆర్టీయూ ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు రేణుక, నాయకులు ఉయ్యాల సైదులు, సిలువేరు శోభారాణి, గొర్ల సోమన్న, ఆదిమల్ల సుధీర్, ఇందూరు సాగర్ పాల్గొన్నారు.

## ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు వసూలు

- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు
- 31మంది బాధితుల నుంచి రూ.10లక్షలకు పైగా వసూలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

తిప్పర్తి, మే13 : ఉద్యోగాలిప్పిస్తామంటూ పలువురు దగ్గర డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరిని తిప్పర్తి పోలీసులు అరెస్టు చేశారు. తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శివరాంరెడ్డి మంగళవారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని పద్మానగర్‌కు చెందిన మోహమ్మద్ నసీర్(ఏ1), నల్లగొండ పట్టణం ఓల్డ్ సిటీకి చెందిన గాజుల జ్యోతి(ఏ2) కొంతకాలంగా నిరుద్యోగ మహిళలకు జిల్లా కోర్టులో కాంట్రాక్ట్ స్వీపర్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసపూరిత హామీలు ఇచ్చారు. ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున వసూలు చేశారు. ఈ క్రమంలో తిప్పర్తి మండలం ఇండ్లూరుకు చెందిన ఏపూరి హెప్సిబా అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. తిప్పర్తి, మాడ్గులపల్లి, నల్లగొండ మండలాలకు చెందిన మొత్తం 31మంది బాధితుల నుంచి రూ.10,32,000 వసూలు చేశారు. వీరిపైన తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో 4, నల్లగొండ వన్‌టౌన్‌లో 3 కేసులు నమోదయ్యాయి. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక మోటర్ సైకిల్, రూ.10వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఎస్పీ శరత్ చంద్ర ఆదేశాల మేరకు త్వరితగతిన ఛేదించిన శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, పీసీ రాంరెడ్డి, పోలీస్ బృందాన్ని డీఎస్పీ అభినందించారు. అమాయకులైన నిరుద్యోగ యువతకు జాబ్ ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేసే వాళ్లను నమ్మి మోసపోవద్దని డీఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది సతీశ్, రాజీవ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

## ఉపాధి సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, మే 12 : మండలంలోని జలాల్‌పూర్‌లో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉపాధి సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో 6 నెలల కాల పరిమితితో కూడిన ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇనస్టలేషన్ అండ్ సర్వీస్ కోర్సు (ఐటీఐ లేదా డిప్లొమా) పాసై ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జార్దోజీ, క్విల్ట్ బ్యాగ్ తయారీ కోర్స్‌కు 8వ తరగతి పాసైన వారు అర్హులని చెప్పారు. ఉచిత శిక్షణ, భోజనంతో కూడిన హాస్టల్ వసతి ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకున్నాక అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 25 ఏండ్ల వయస్సు కలిగి ఉండాలని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు మే 16 న రామానంద సంస్థలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222 ఫోన్ నంబర్లలో సంప్రదించలని సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లూ సగమే..

## 4.50 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2.70 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గింపు



ఆత్మకూర్.ఎస్ మండలం ఇస్తళాపురం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

- సూర్యాపేట జిల్లాలో టార్గెట్ కుదించిన అధికారులు
- పండింది 12 లక్షల మెట్రిక్ టన్నులు..
- ఇప్పటి వరకు కొన్నది 2.18 లక్షల మెట్రిక్ టన్నులే
- మందకొడిగా ధాన్యం కొనుగోళ్లతో రైతులు ఇబ్బందులు

సూర్యాపేట, మే 13 (నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం రైతులను మోసం చేస్తున్నది. పండిన ధాన్యంలో సగం కూడా కొనే పరిస్థితిలో సర్కారు లేనట్లు కనిపిస్తున్నది. సూర్యాపేట జిల్లాలో 4,73,739 ఎకరాల్లో వరి సాగు చేయగా 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వీటిలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని తొలుత చెప్పిన అధికారులు తదనంతరం ఆ టార్గెట్‌ను మూడు సార్లు తగ్గించారు. చివరకు 2.70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 2.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా వీటిలో 46,010 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు, 1,71,731 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో రైతులు పండించిన పంటను వందకు వంద శాతం కొనుగోలు చేసి రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొనుగోళ్లకు ఇబ్బందులు తప్పడం లేదు.

### కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు తిప్పలు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాలకు అసంతృప్తిని మిగుల్చుతున్నది. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల కంటే అత్యధికంగా సంతోషంగా జీవించేలా రైతాంగానికి అన్నీ అందించగా నేడు అదే రైతన్నలు మళ్లీ గత ఉమ్మడి రాష్ట్ర దీన పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు రాక పంటలు ఎండితే పరిహారం లేదు, కనీసం మందలిచ్చేందుకు, ధైర్యం చెప్పేందుకు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు చివరకు అధికారులు కూడా వెళ్లని హీన పరిస్థితికి రైతులు చేరుకున్నారు. ఇక ఈ యాసంగిలో కష్టపడి అంతోఇంతో పండించిన పంటను అమ్ముకునేందుకు దిక్కూమొక్కు లేకుండా పోయింది. జిల్లాలో దాదాపు 70శాతం పంట కోతలు పూర్తయిన తరువాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా లారీల ట్రాన్స్‌పోర్టు ఇబ్బందులు, తరుగు పేరుతో మిల్లుల్లో కిలో నుంచి రెండు కిలోల దోపిడీలు, ఐకేపీ కేంద్రాల నుంచి వెళ్లిన ధాన్యానికి దిగమతుల కష్టాలు, మరో పక్క కాంటాలు కాక 20 రోజుల నుంచి నెలకు పైనే ఐకేపీ కేంద్రాల్లో నిరీక్షణలు, అకాల వర్షాలతో ధాన్యం తడవడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

### అంచనాలను తగ్గిస్తూ..

ప్రభుత్వ ఆదేశాలో లేక అధికారుల నిర్లక్ష్యమో జిల్లాలో కొనుగోళ్లు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని కుదిస్తూ రావడం ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నది. తొలుత సూర్యాపేట జిల్లాలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించగా తదనంతరం 4.13, ఆ తర్వాత 3.50 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించారు. తాజాగా 2.70 లక్షల మెట్రిక్ టన్నులకు కుదించారు. ఇప్పటి వరకు 2.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 50 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశం ఉందని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. వాస్తవానికి ఈ సీజన్‌లో జిల్లాలో 4,73,739 ఎకరాల్లో వరి సాగు చేయగా 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందని వ్యవసాయశాఖ అంచనాలు వేసింది. వీటిలో ఇప్పటి వరకు 32,365 మంది రైతుల నుంచి 2.18 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా ఇందులో 46,010 మెట్రిక్ టన్నులు సన్నాలు, 1,71,731 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం ఉన్నాయి. 13,691 మంది రైతులకు రూ.203 కోట్లు చెల్లించగా మరో 18,674 మంది రైతులకు రూ.301 కోట్లు చెల్లించాల్సి ఉంది. కొనుగోలు చేసిన సన్నాలకు సంబంధించి ఇప్పటి వరకు క్వింటాకు రూ.500 బోనస్ ఊసే లేదని తెలిసింది. మొత్తం మీద ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం విఫలం కావడం పట్ల రైతాంగం తీవ్ర అసహనం, ఆగ్రహంతో ఉన్నది.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారులు

- 400 క్వింటాళ్ల ధాన్యం స్వాధీనం
- ఏఈఓ సస్పెన్షన్.. పీఏసీఎస్ ఇన్‌చార్జి విధుల నుంచి తొలగింపు

రాజాపేట, మే 13 : మండలంలోని దూది వెంకటాపూర్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారులు ధాన్యం విక్రయాలు జరుపుతున్న విషయం తనిఖీల్లో మంగళవారం బయటపడింది. రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధరకు విక్రయించే దళారుల అక్రమాలు అధికారుల దృష్టికి వచ్చాయి. భువనగిరి ఆర్డీఓ కృష్ణా రెడ్డి, తాసీల్దార్ అనిత నేతృత్వంలో రెవెన్యూ, వ్యవసాయ, సహకార, పౌర సరఫరాల శాఖల బృందం జరిపిన తనిఖీల్లో నక్కిర్తి కనకరత్నం, నక్కిర్తి లక్ష్మి (భార్యాభర్తలు), వస్పరి మహేశ్ ముగ్గురు దళారుల నుంచి 400 క్వింటాళ్ల ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిన్న, సన్నకారు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి, పీఏసీఎస్‌లో మద్దతు ధరకు అమ్ముతూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు సమాచారంతో విచారణ చేపట్టారు. గ్రామస్తుల ధృవీకరణతో ధాన్యం దళారులదేనని తేలగా స్వాధీనం చేసుకున్న ధాన్యాన్ని సమీప మిల్లులో భద్రపరిచారు. ఈ ఘటనపై సహకార శాఖ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేసి, వ్యవసాయ విభాగంలోని ఏఈఓను సస్పెండ్ చేశారు. పీఏసీఎస్ ఇన్‌చార్జిని విధుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా తగిన నిఘా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలు జారీ చేశారు.



దూది వెంకటాపురంలో విచారణ చేపడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి



నల్లగొండ ఎన్‌జీ కళాశాలలో పాలిసెట్‌కు హాజరైన విద్యార్థులు

## సజావుగా టీజీ పాలిసెట్

- హాజరైన 9,325 మంది విద్యార్థులు



సూర్యాపేటలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

రామగిరి/యాదగిరి గుట్ట, మే 13 : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి తెలంగాణ సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన టీజీ పాలిసెట్-2025 ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సజావుగా జరిగింది. నల్లగొండ, సూర్యాపేట, తిరుమలగిరి, భువనగిరి, యాదగిరిగుట్టలో 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 10,125మంది విద్యార్థులకుగానూ 9,325మంది విద్యార్థులు హాజరయ్యారు. 800 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష ఉండగా సమయం సమీపిస్తుండటంతో కొన్ని సెంటర్ల వద్ద విద్యార్థులు పరుగులు తీస్తూ వచ్చారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని 11 పరీక్ష కేంద్రాల్లో 5,203మందికి విద్యార్థులకుగానూ 4,750 మంది.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాల్లో 2,798 మందికి 2,590 మంది.. తిరుమలగిరిలోని పరీక్ష కేంద్రంలో 350మందికి 321మంది.. యాద్రాది భువనగిరి జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాల్లో 1,754మందికి 1,664మంది హాజరయ్యారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కోఆర్డినేటర్లు సీహెచ్.నరసింహారావు, కె.సుజాత, వెంకటేశ్వర్లు పరీక్షల తీరును పర్యవేక్షించారు.

# పన్నులు వసూలు చేసి సొంతానికి..

## మోత్కూరు మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్ల చేతివాటం

- రూ.15 నుంచి 20 లక్షల సొమ్ము మాయం
- రసీదు బుక్కులు ఇవ్వకుండా.. లెక్కలు చూపకుండా నిర్లక్ష్యం
- పాలకవర్గం లేకపోవడం.. అధికారుల పర్యవేక్షణ కొరవడడమే కారణం




మోత్కూరు మున్సిపల్ కార్యాలయం

మోత్కూరు, మే 13 : మోత్కూరు మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. పన్నులను వసూలు చేసి బిల్ కలెక్టర్లు సొంతానికి వాడుకుంటున్నారు. రసీదులను మున్సిపల్ కార్యాలయంలో అప్పగించకుండా, వసూలు చేసిన పన్ను డబ్బులను చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడడం, మున్సిపల్ పాలకవర్గం పాలన ముగియడం, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బిల్ కలెక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మున్సిపాలిటీలో పని చేస్తున్న ఎనిమిది మంది బిల్ కలెక్టర్లు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు కాజేసినట్లు తెలుస్తున్నది. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న మాదిరిగానే మున్సిపల్ పాలనలో ఉంటుందని భావించి వారు ఈ అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం.

### అందినకాడికి దోపిడీ..

మోత్కూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న కొందరు వాటర్ పంపు డ్రైవర్లు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో బిల్ కలెకర హోదాలో కొంత కాలంగా పని చేస్తున్నారు. వీరు 2021 జూన్-జూలై నుంచి పురపాలిక పరిధిలో ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, వర్తక, వ్యాపార షాపుల లైసెన్స్ రెన్యూవల్స్‌ను నిర్వహిస్తున్నారు. వసూలు చేసిన పన్నులను ఏ రోజుకారోజు ప్రభుత్వ ఖజానాలో జమ చేసి లెక్కలను చూపాల్సి ఉంది. ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం మారడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటం, ఆ తర్వాత పురపాలిక చైరపర్సన్‌పై అవిశ్వాసం పెట్టి కొత్త చైరపర్సన్ ఎన్నిక కావడం, ఆ తర్వాత ఏడాదిలోనే వారి పాలన ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో పురపాలిక కమిషనర్ కె.సతీశ్‌కుమార్ కొత్తగా బాధ్యతలు చేపట్టడం, గతంలో ఇక్కడ పని చేసిన ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ పదోన్నతిపై బదిలీ కావడంతో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఏండ్ల తరబడిగా ఇక్కడే పని చేస్తున్న పంపు డ్రైవర్లు, బిల్లు కలెక్టర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వసూలు చేసిన పన్నుల లెక్కలను చూపకుండా అందిన కాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

### పన్నుల్లో రిబేట్‌తో ఎక్కువ వసూలు

ప్రభుత్వం గత మార్చి 31వ తేదీ లోపు పన్నులు చెల్లింపు చేసిన వారికి పెద్ద మొత్తంలో రిబేట్ కల్పించింది. దీంతో ఎక్కువ మంది తమ పన్నులను చెల్లించారు. జిల్లాలోనే మోత్కూరు మున్సిపాలిటీ ఉత్తమ అవార్డును సైతం కైవసం చేసుకుంది. కానీ వసూలు చేసిన పన్నులు పూర్తిగా ప్రభుత్వ ఖజానాకు జమ కాలేదు. మున్సిపాలిటీలో పని చేస్తున్న ఎనిమిది మంది బిల్ కలెక్టర్లు రూ.15 లక్షల నుంచి రూ.20లక్షల వరకు సొంతానికి వాడుకొని లెక్కలు చెప్పలేదని తెలుస్తున్నది. మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్ తన కుమార్తెకు సర్జరీ కావడంతో 15 రోజులు సెలవుపై వెళ్లారు. దీనిపై వివరణ అడిగేందుకు ఆయన్ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. పన్నుల వసూళ్లపై తమకేమీ తెలియదని, కమిషనర్ సతీశ్‌కుమార్‌కే తెలుసని మున్సిపాలిటీ మేనేజర్ ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దీనిపై స్పందించి సిబ్బంది పనితీరు, బిల్లు కలెక్టర్ల అక్రమాలపై విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

### మందలించినా మార్పు రాలే..

మున్సిపాలిటీ పరిధిలో పట్టణంతో పాటు కొండగడప, బుజిలాపురం, ధర్మాపురం, రాజన్నగూడెం, కొండాపురం, జామచెట్లబావి, ఆరెగూడెం గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న నివాసదారుల నుంచి పద్దు వారీగా ముక్కుపిండి వసూలు చేసిన సొమ్మును ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా స్వాహా చేసి, రసీదు బుక్కులను కార్యాలయంలో అప్పగించడం లేదన్న ఆరోపణలున్నాయి. వసూలు చేసిన పన్నులను కూడా జమ చేయకుండా, కార్యాలయంలో రసీదు బుక్కులను అప్పగించక పోవడంపై ఇటీవల కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ వారిని తీవ్రంగా మందలించినట్లు తెలుస్తున్నది. అయినా వారిలో మార్పు రాకపోవడం, వసూలు చేసిన పన్నుల లెక్కలను చూపెట్టకుండా ఉన్న బిల్లు కలెక్టర్లను సిబ్బంది సమీక్షలోనూ ఆదేశించారు. వార్డు ఆఫీసర్లుగా పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమన్వయంతో పలు పన్నులను వసూలు కోసం ప్రణాళికలు చేశారు. అయినా వార్డు ఆఫీసర్లు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించి పర్యవేక్షణను పట్టించుకోకపోవడంతో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న సిబ్బంది ఇష్టారాజ్యం పెరిగిపోయింది. అందిన కాడికి వారు పన్నుల పేరిట వసూలు చేసి కాజేశారు.

